క్లుప్తంగా

ఎస్పీని కలసిన కాపు ప్రవీణ్



ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కాపు ప్రవీణ్‌రెడ్డి

రాయదుర్గం: ఎస్పీ ఫక్కీరప్పను అనంతపురంలోని ఎస్పీ క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు కాపు ప్రవీణ్‌రెడ్డి శనివారం కలిశారు. ఇటీవల రాయదుర్గంలోని జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన ఆర్‌వైఎస్‌ఎల్ మెగా క్రీడా టోర్నీ ఫైనల్లో ఎస్పీ పాల్గొన్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పలువురు క్రీడాకారులలతో కలసి ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. గ్రామీణ యువతలో నైపుణ్యతను వెలికి తీసేందుకే ప్రతి ఏటా టోర్నీ నిర్వహణకు శ్రీకారం చుట్టామని ఎస్పీకి వివరించారు. ఇందుకు కాపు ప్రవీణ్‌రెడ్డిని ఎస్పీ అభినందించారు.

చెత్తతో సంపద తయారీ కేంద్రం తనిఖీ

కూడేరు: మండలంలోని జల్లిపల్లిలో ఉన్న చెత్తతో సంపద తయారీ కేంద్రాన్ని శనివారం ఎంపీడీఓ ముస్తఫా కమల్ బాషా ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో తయారవుతున్న వర్మీకంపోస్టు ఎరువును ఆయన పరిశీలించారు. చెత్తతో ఎక్కువ మోతాదులో వర్మీ కంపోస్టు ఎరువును తయారు చేసి రైతులకు విక్రయించి, వచ్చే ఆదాయంతో పంచాయతీలో అభివృద్ధి పనులకు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శివరంజని, ఏపీఓ తులసీప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఫాతిమా, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

'ఎస్‌ఐ వివక్ష వీడాలి'

కళ్యాణదుర్గం రూరల్: శెట్టూరు ఎస్‌ఐ యువరాజ్ వివక్ష వీడాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహం వద్ద శనివారం ఎల్‌ఆర్‌ఎఫ్ నాయకులు ఓబులేష్, ఎర్రిస్వామి, దళిత, గిరిజన సంఘాల నాయకులు విజయ్, గంగాధర్, తిప్పేస్వామినాయక్, గురుమూర్తి, రామాంజి, ఆర్‌కే రాజు, సుధాకర్, మారెన్న సమావేశమై నిరసన తెలిపారు. ఎస్‌ఐ నియంతృత్వ ధోరణి అవలంభిస్తున్నారని, దళిత, గిరిజనులను పక్షపాతంగా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తన తీరును మార్చుకుని పోలీస్ స్టేషన్‌లో గౌరవమివ్వాలని వారు డిమాండ్ చేశారు.

నేడు కంటి వైద్య శిబిరం

కణేకల్లు: స్థానిక చిక్కణ్ణేశ్వరస్వామి కల్యాణ మంటపంలో ఆదివారం జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ, బ్రాహ్మణి సోషల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత కంటి చికిత్స శిబిరం నిర్వహించనున్నట్లు పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ టి.కేశవరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆర్కే బద్రీ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బెంగళూరుకు చెందిన ప్రముఖ శంకర్ కంటి ఆస్పత్రి వైద్యులు వైద్య పరీక్షలు చేస్తారన్నారు.

కొటేషన్లకు ఆహ్వానం

వజ్రకరూరు: మండలంలోని జరుట్లరాంపురం జరుట్ల రామలింగేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను(2023) పురస్కరించుకుని వివిధ పనులు చేపట్టేందుకు కొటేషన్లు ఆహ్వానిస్తున్నట్లు ఈఓ దేవదాస్ తెలిపారు. శనివారం ఆలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో సున్నం పూయడం, విద్యుత్‌దీపాల అలంకరణ, చలువ పందిళ్ల ఏర్పాటు, రంగుల వేయడం తదితర పనులు చేపట్టేందుకు కొటేషన్లు ఆహ్వానిస్తున్నామన్నారు. ఆసక్తి ఉన్న వారు ఆలయ అధికారులను, సిబ్బందిని సంప్రదించాలని ఈఓ కోరారు.

రేషన్ బియ్యం పట్టివేత

ఉరవకొండ: అక్రమంగా కర్ణాటకకు తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు విజిలెన్స్ సీఐ వెంకటరమణ తెలిపారు. నింబగల్లు సమీపంలోని ఆదెప్పస్వామి ఆలయం వద్ద వాహన తనిఖీలు చేపట్టిన సమయంలో బొలెరో వాహనాన్ని ఆపి పరిశీలించారు. అందులో 20 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లుగా గుర్తించి, వాహన డ్రైవర్, కర్ణాటకలోని జగలూరుకు చెందిన ఆజీజ్‌ను అదుపులోకి తీసుకున్నారు. రేషన్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులకు, వాహనాన్ని సీజ్ చేసి పోలీసులకు అప్పగించారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. తనిఖీల్లో ఎఫ్‌ఆర్‌ఓ యామిని సరస్వతి, సీఎస్‌డీటీ రమేష్‌బాబు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రదాత జగనన్నకు జేజేలు



కళ్యాణదుర్గం రూరల్: ప్రజలతో కలసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జేజేలు పలుకుతున్న మంత్రి ఉషశ్రీచరణ్



గుమ్మఘట్ట: 75వీరాపురంలో సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

కళ్యాణదుర్గం రూరల్: సంక్షేమ పథకాల ప్రదాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు జేజేలు కొట్టారు. మండలంలోని ముద్దినాయనపల్లిలో శనివారం రాష్ట్ర స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ చరణ్ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రజలతో కలిసి మంత్రి ఇంటింటికి వెళ్లినప్పుడు పేదలు జేజేలు పలికారు. సీఎం జగనన్న...నువ్వే మాకు అండాదండ అంటూ నినాదాలు చేశారు. మంత్రి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. నవరత్న పథకాలు నేరుగా ఇంటివద్దకే అందిస్తున్న సీఎం జగనన్నను మళ్లీ గెలిపించుకుందామని ఆమె కోరారు. అనంతరం మండలంలోని ఇట్లంపల్లి గ్రామంలో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంలో మంత్రి పాల్గొని ప్రజలతో మాట్లాడారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగనన్నకు అండగా ఉండాలని పిలుపునిచ్చారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచులు చంద్రానాయక్, సీతమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు బొమ్మన్న, ఎంపీటీసీ పక్కీరమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ ఆంజనేయులు, డీలర్లు వెంకటేశులు, వెంకటరమణ, మాజీ సర్పంచు అక్కులప్ప, నాయకులు నగేష్‌నాయక్, శివలింగారెడ్డి, భాస్కర్‌రెడ్డి, అంజన్‌రెడ్డి, బాబు, నరేంద్రరెడ్డి, వెంకటరామ్‌నాయక్, దొణస్వామి, చిత్తయ్య, సచివాలయ కన్వీనర్లు, అధికారులు పాల్గొన్నారు.

జగనన్న మేలు మరువం

గుమ్మఘట్ట: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల లబ్ధిని మరువలేమని పలువురు లబ్ధిదారులు ప్రభుత్వ విప్ కాపురామచంద్రారెడ్డి వద్ద సంతోషం వ్యక్తం చేశారు. మండలంలోని 75 వీరాపురం గ్రామంలో శనివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. విప్ ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందజేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలన్నారు. టీడీపీ నాయకుల వక్రమాటలను నమ్మి ఓట్లు వేస్తే జీవితాలు అంధకారంలోకి వెళ్లడం ఖాయమన్నారు. చేతులారా ఇంటివద్దకే వస్తున్న సంక్షేమపథకాల లబ్ధిని పోగొట్టుకోవద్దని విప్ సూచించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ సురేశ్‌బాబు, జెడ్పీటీసీ సభ్యుడు పీఎస్ మహేష్, ఎంపీపీ భవాని, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మంజునాథ, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందు, రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు నాగిరెడ్డి, కాంట్రాక్టర్ కొత్తపల్లి సత్యనారాయణ రెడ్డి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ మేకల శ్రీనివాసులు, సర్పంచ్ ఉమేష్‌రెడ్డి, ఎంపీటీసీ గోవిందు, నాయకులు రవి, ఎర్రిస్వామి, రుద్రరెడ్డి, గోవిందరెడ్డి, బేలోడు రామాంజనేయులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ దినోత్సవంపై ర్యాలీ

బొమ్మనహాళ్: శ్రీధరఘట్ట, ఎల్‌బీనగర్, ఉద్దేహాళ్, బొమ్మనహాళ్ గ్రామాల్లో శనివారం ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీధరఘట్ట పీహెచ్‌సీ వైద్యాధికారిణి గీతాభార్గవి హెల్త్ ఎడ్యుకేటర్ విజయభారతి, ఆరోగ్య కార్యకర్తలు గోవర్ధన, రమణ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గ్యాస్ వినియోగంపై అవగాహన

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు వంట గ్యాస్ వినియోగం, ప్రమాదాల నివారణ తదితర అంశాలపై ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ఆధ్వర్యంలో శనివారం సేఫ్టీ క్లినిక్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ నాగమణి, ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రొప్రైటర్ శ్రీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

ఉరవకొండ: ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన సయ్యద్ షాబుద్దీన్‌ను శనివారం ఆయన చాంబర్‌లో కురుబ, ఎంబీసీ కార్పొరేషన్ల డైరెక్టర్లు గోవిందు, వెంకటేష్, వైస్ ఎంపీపీ నరసింహులు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నేతలు ఘనంగా సత్కరించారు. నాయకులు మూలగిరిపల్లి ఓబన్న, పచ్చిరవి, భీమా, మీనుగ ఎర్రిస్వామి, ముండాసు ఓబుళేసు, ఉలిగప్ప తదితరులు పాల్గొన్నారు.

విజయం కోసం సైనికుల్లా పనిచేయాలి



లోగో ఆవిష్కరిస్తున్న మంత్రి కేవీ ఉషశ్రీచరణ్

కళ్యాణదుర్గం: సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పార్టీ విజయం కోసం సైనికుల్లా పనిచేయాలని మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ సూచించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం కళ్యాణదుర్గం అర్బన్ పరిధిలోని సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లతో మంత్రి సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రభుత్వం అందించిన పథకాలు, లబ్ధిపై ప్రజలకు వివరించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రభుత్వం ద్వారా పొందిన లబ్ధిని వివరిస్తూ రానున్న ఎన్నికల్లో ఓటు బ్యాంకుగా మలుచుకోవాలని సూచించారు. నేటికీ అర్హులుగా ఉండి పథకాలు అందని వారి వివరాలను సేకరించి ఆయా వార్డు సచివాలయాల పరిధిలో దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో అర్బన్ సచివాలయాల కన్వీనర్ అర్చన, మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫణి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, మెప్మా పట్టణ అధ్యక్షురాలు హేమ, సీనియర్ నాయకుడు సుధీర్, కోఆప్షన్ సభ్యుడు అఫ్జల్, వక్ఫ్ బోర్డు సభ్యుడు షేక్షావలి, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

చిన్నారి ఆరోగ్యానికి మంత్రి అండ

కుందుర్పి : మండలంలోని ఎనుములదడ్డి గ్రామానికి చెందిన మంజునాథ కుమార్తె తనుశ్రీ (15 నెలలు) ఆరోగ్యానికి మంత్రి ఉషశ్రీచరణ్ అండగా నిలిచింది. ఇటీవల ఎనుములదొడ్డి గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి వెళ్లిన మంత్రికి చిన్నారి తండ్రి మంజునాథ్ కుమార్తెకు వినికిడి లోపం ఉందని వివరించారు. ఆర్థికస్థోమత లేదని, ఆదుకుని కుమార్తె ఆరోగ్యాన్ని కాపాడాలని విన్నవించారు. ఇందుకు చలించిన మంత్రి సమస్యను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి.. చిన్నారి ఆరోగ్యం కోసం ప్రభుత్వం నుంచి రూ.2.50 లక్షలు ఆర్థిక సాయం మంజూరు చేయించారు. మంజూరు పత్రాన్ని శనివారం మంత్రి కార్యాలయం వద్ద చిన్నారి తండ్రి మంజునాథ కుటుంబ సభ్యులకు అందజేశారు. సీఎం జగన్, మంత్రికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ముగిసిన నందీశ్వర విగ్రహ ప్రతిష్ట మహోత్సవం



నందీశ్వరున్ని దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి

వజ్రకరూరు: మండలంలోని గూళ్యపాళ్యం గురుదేవా ఆశ్రమంలో నందీశ్వర విగ్రహ ప్రతిష్ట వేడుకలు చివరి రోజు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా ఆశ్రమంలో చంద్రమౌళీశ్వరస్వామి, నందీశ్వర శిలా విగ్రహానికి ప్రత్యేక పూజలతో పా టు రుద్రహోమం, రుద్రాభిషేకం, అష్టోత్తర శతనామావాళి, కుంకుమార్చన, శాంతిహోమం, నందీశ్వరహోమం, నవగ్రహ హోమం చేపట్టారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆశ్రమ పీఠాధి పతి ప్రణవానందగిరి గురుస్వామి భక్తుల నుద్దేశించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో నడిచి ముక్తిని పొందాలన్నారు. కార్యక్రమంలో వివిధ మఠాలపీఠాధిపతులు శివానంద భారతిస్వామి, దండి నిర్మలానందగిరిస్వామి, కరిబసవ రాజేంద్రస్వామి, విద్యానందస్వామి, స్వయంప్రకాశానందగిరిస్వామి, సుధీరానందరిగిస్వామి, స్వరూపానందస్వామి, శివరామానంద భారతీస్వామి, ఆత్మానందపురి స్వామి, ప్రేమానందసరస్వతీ, చరణానందగిరి, శివానందస్వామి, నిత్యానందభారతీస్వామి, మహేశ్వరానందగిరి స్వామి, శివరామస్వామి, మల్లేశశరణరు, తిమ్మప్ప స్వామి, పసుపులేటి నాగశయన, రామేశ్వరశర్మ, సిద్ధలింగస్వామి తదితరులు హాజరయ్యారు. గ్రామస్తులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలిరావడంతో ఆశ్రమం పోటెత్తింది. కాగా ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి నందీశ్వర విగ్రహాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి కార్యక్రమాలు



18వ వార్డులో సీసీ రోడ్డుకు భూమి పూజ చేస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గంటౌన్: పట్టణంలో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కింద దాదాపు రూ.3.60 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. పట్టణంలోని 15వ వార్డులోని గ్యాస్ గొడౌన్, 18వ వార్డు అజాద్ ఉర్దూ స్కూల్ వద్ద రూ.22 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, కమిషనర్ దివాకర్‌రెడ్డితో కలిసి భూమి పూజ చేసి ప్రారంభించారు. విప్ మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. జగన్ పాలన పట్ల ప్రజలు సంతోషంగా ఉంటే టీడీపీ నాయకులు ఓర్వలేకపోతున్నారని ధ్వజమెత్తారు. చంద్రబాబు, లోకేష్ కలసి పాదయాత్ర చేసినా ఒరిగేది శూన్యమన్నారు. ప్రజల్లో విశ్వాసం కోల్పోయిన వారు రాజకీయాలకు అన్‌ఫిట్ అన్నారు. 2024 ఎన్నికల్లో టీడీపీకి శాశ్వత రాజకీయ సమాధి తప్పదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు శ్రీనివాసయాదవ్, వలిబాషా, గుమ్మఘట్ట జెడ్పీటీసీ కలుగోడు మహేష్, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ మేకల శ్రీనివాసులు, పట్టణ కన్వీనర్ ముస్తాక్, సీనియర్ నాయకుడు కొత్తపల్లి సత్యనారాయణ, కౌన్సిలర్లు శ్రీలక్ష్మి, మంజునాథ, సాబిరాబీ, గౌని లావణ్య, గోవిందరాజులు, షబ్బీర్, డిష్ గోవిందు, ఫకృద్దీన్, శ్రీనివాసరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు శ్రీనివాసులు, డీఈ రామ్మూర్తి, వార్డు ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయండి



మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

ఉరవకొండ: నియోజకవర్గంలో పండ్లతోటలతో పాటు మిర్చి, పప్పుశనగ, కూరగాయాలు అధికంగా పండిస్తారని, దీన్ని దృష్టిలో ఉంచుకొని మండల కేంద్రాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, కోల్డ్ స్టోరేజ్‌లు ఏర్పాటు చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి వినతి పత్రం అందజేశారు. శనివారం అనంతపురంలోని మాజీ ఎమ్మెల్యే స్వగృహంలో ఏర్పాటు చేసిన అల్పాహార విందుకు మంత్రి హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్యేతో పాటు ఆయన సతీమణి భువనేశ్వరి, తనయుడు వై.ప్రణయ్‌రెడ్డి, పార్టీ నియోజకవర్గ నాయకులు మంత్రికి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి దృష్టికి మాజీ ఎమ్మెల్యే పలు సమస్యలను తీసుకెళ్లారు. చిరుధాన్యాలను సాగుచేసేలా రైతులను చైతన్య పరుస్తున్నామన్నారు. ఉరవకొండ డివిజన్‌లో ఐదు రైతు ఉత్పత్తిదారుల సంఘాలు పనిచేస్తున్నాయని, సంఘాలను మరింత పెంచడానికి వ్యవసాయ, ఉద్యానవన అధికారులు కృషి చేస్తున్నారన్నారు. ఉద్యాన శాఖ తరపున నియోజకవర్గంలోని ప్రతి మండలానికి ఓ కోల్డ్ రూం, సోలార్ కోల్డ్ రూం, హార్టికల్చర్ కలెక్షన్ సెంటర్ ఇవ్వడానికి అనుమతులు ఇవ్వాలని మంత్రిని కోరారు. అలాగే నియోజకవర్గంలో మిర్చి పంటకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఇన్సూరెన్స్‌ను మంజూరు చేయాలని పార్టీ రాష్ట్ర నాయకులు అశోక్, తేజోనాథ్ తదితరులు మాజీ ఎమ్మెల్యేతో కలసి మంత్రికు వినతి పత్రం అందించారు.

సబ్సిడీతో ఆముదం విత్తనాలివ్వాలి

కూడేరు: రైతులకు సబ్సిడీతో ఆముదం విత్తనాలివ్వాలని వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిని ఎంపీపీ నారాయణరెడ్డి, మండల వైఎస్సార్ సీపీ నేతలు కోరారు. శనివారం అనంతపురంలో వారు మంత్రిని కలిశారు. మండలంలో పి.నారాయణపురం, చోళసముద్రం, జయపురం, కరుట్లపల్లి, కడదరకుంట, కూడేరు, ఇప్పేరు తదితర గ్రామాల్లో సుమారు 8 వేల ఎకరాల్లో ఆముదం పంట సాగు చేస్తారని మంత్రికి వివరించారు. ఆముదం విత్తనాలను సబ్సిడీతో ఇచ్చేందుకు కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు బైరెడ్డి రామచంద్రారెడ్డి, శిద్ధారెడ్డి, గంగాధర్, గురునాథ్‌రెడ్డి, ఆర్.క్రిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తిరుకల్యాణోత్సవాల హోమాలు

బెళుగుప్ప: మండలంలోని శ్రీరంగాపురం రంగనాథస్వామి తిరు కల్యాణోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం సుప్రభాత సేవ, గణపతి పుణ్యానాంది, నవగ్రహారాదన, గణపతి పూజలు నిర్వహించారు. సాయంత్రం గణపతి, నవగ్రహ, పూర్ణాహుతి హోమాలు చేపట్టారు. ఆదివారం తెల్లవారుజామున శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామి కల్యాణోత్సవం అనంతరం ఉత్సవ ఊరేగింపు కార్యక్రమాలుంటాయని ఆలయకమిటీ సభ్యులు తెలిపారు.

కమనీయం.. నవనారసింహుని కల్యాణం



రాయదుర్గం రూరల్: నవనారసింహస్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు



ఉరవకొండ: మల్లేశ్వరస్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

రాయదుర్గం రూరల్: మండలంలోని మల్లాపురం గ్రామ పంచాయతీ పరిధి విప్రమలై లక్ష్మీనవ నారసింహస్వామి కల్యాణోత్సవం శనివారం అశేష భక్తజనసందోహం మధ్య కమనీయంగా సాగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన కల్యాణోత్సవంలో పాల్గొన్న వేలాది మంది భక్తుల నోట ధ్వనించిన గోవింద నామస్మరణతో విప్రమలై కొండలు మార్మోగాయి. ఆలయ గౌరవాధ్యక్షుడు శ్రీరామూర్తి స్వామిజీ ఆధ్వర్యంలో ఉదయం 11.15 గంటలకు ప్రధాన అర్చకుడు సుబ్రహ్మణ్యస్వామి, వేదపండితులు హరిప్రసాద్ , భరద్వాజ్ వేదమంత్రోచ్ఛారణల మధ్య స్వామి కల్యాణం కనులపండువగా చేపట్టారు. అనంతరం నాలుగు పేద జంటలకు సామూహిక వివాహాలు జరిపించారు. సాయంత్రం అన్న సంతర్పణ ఏర్పాటు చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ కళారాధన బాలికలు ప్రదర్శించిన నృత్యరూపకం ఆకట్టుకుంది. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పొరాళు శిల్ప, కౌన్సిలర్లు లక్ష్మి, పద్మజ, నాగవేణి , ఆలయ కమిటీ అధ్యక్షుడు బీఎస్ తిప్పేస్వామి, ఉపాధ్యక్షుడు ధర్మన్న, కార్యదర్శి గురురాఘవేంద్ర ప్రసాద్ , కోశాధికారులు సత్యనారాయణ, జీఎస్ నరసింహులు, అకౌంటెంట్ వెంకటేశులు, కమిటీ సభ్యులు గురునాథ్ రెడ్డి, రామిరెడ్డి, వెంకటరెడ్డి, తిప్పేస్వామి, కమలాక్షుడు, పాలయ్య తదితరులు పాల్గొన్నారు. కాగా బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం బ్రహ్మరథోత్సవం నిర్వహించనున్నారు.

మల్లేశ్వర స్వామి కల్యాణోత్సవం

ఉరవకొండ: పట్టణంలోని మల్లేశ్వరస్వామి ఆలయంలో శనివారం కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామికి విశేష పూజలు, అభిషేకాలు చేపట్టారు. అనంతరం పార్వతీదేవి సమేత మల్లేశ్వరస్వామి ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలతో అలంకరించారు. అభిజిత్ లగ్నంలో వేదపండితుల మంత్రోచ్చారణ మధ్య స్వామి కల్యాణోత్సవం నిర్వహించారు. భకులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాల్లో భాగంగా శివమాలధారుల ఆధ్వర్యంలో ఆదివారం స్వామి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

సంక్షిప్త సమాచారం

సుస్థిర అభివృద్ధిపై సమావేశం

విడపనకల్లు: స్థానిక ఎంపీడీఓ సమావేశం భవనంలో శనివారం గ్రామ సచివాలయ సిబ్బందితో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై ఏఎస్‌ఓ పర్వతప్ప సమావేశం నిర్వహించారు. 2030 నాటికి సాధించాల్సిన సుస్థిర అభివృద్ధి ప్రణాళికల లక్ష్యాలపై తీసుకోవాల్సిన అంశాలను వివరించారు. ఈనెల 7న అనంతపురం పట్టణానికి ముఖ్యమంత్రి సలహాదారు డాక్టర్ సమీర్ శర్మ హాజరై సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై సమీక్ష నిర్వహిస్తారన్నారు. కార్యక్రమానికి సచివాలయ ఉద్యోగులు హాజరు కావాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, వెల్ఫేర్ అసిస్టెంట్, ఏఎస్‌ఎం, మహిళా పోలీసులు, సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

బెంగళూరు వెళ్లి పింఛన్ అందజేత

కళ్యాణదుర్గం: పట్టణంలోని 16వ వార్డులో నివాసముంటున్న నూరుల్లా అనారోగ్యంతో బెంగళూరులోని విక్టోరియా ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నాడు. విషయం తెలుసుకున్న 8వ సచివాలయ వలంటీర్ సర్ఫరాజ్ బెంగళూరుకు వెళ్లి పింఛను అందజేశాడు. అంత దూరం వెళ్లి పింఛన్ అందజేసిన వలంటీర్‌ను సచివాలయ సిబ్బంది అభినందించారు.

షార్ట్ సర్క్యూట్‌తో వరిగడ్డి దగ్ధం

ఉరవకొండ: స్థానిక అంబేడ్కర్ నగర్ వద్ద ట్రాక్టర్‌లో తరలిస్తున్న వరిగడ్డి లోడుకు విద్యుత్ తీగలు షాట్ సర్క్యూట్ కావడంతో భారీగా మంటలు చెలరేగాయి. ఉరవకొండకు చెందిన రైతు లింగన్న కణేకల్లులో ట్రాక్టర్ వరిగడ్డిని రూ.10 వేలకు కొనుగోలు చేశాడు. వరిగడ్డి లోడుతో వస్తున్న ట్రాక్టర్‌కు విద్యుత్ తీగలు తగిలి మంటలు వ్యాపించాయి. స్థానికులు కేకలు వేయడంతో డ్రైవర్ అప్రమత్తమై ట్రాలీ పైకి లేపి గడ్డి కింద పడేశాడు. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది వచ్చి మంటలను ఆర్పేశారు.

గుడిసె దగ్ధం

విడపనకల్లు: మండలంలోని హావళిగి గ్రామంలో శనివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధమైంది. నిత్యావసర సరుకులు, జొన్నలు పూర్తిగా కాలిపోయాయని బాధితులు లక్ష్మీదేవి, మీసాల ఓబిలేసు ఆవేదన వ్యక్తం చేశారు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నేత భరత్‌రెడ్డి, సర్పంచు గీతమ్మ, ఎంపీటీసీ కళావతి, రాజమ్మ, రఘురాం బాధితులను పరామర్శించి, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి సహకారంతో రు.5 వేల నగదు, నిత్యావసర సరుకులు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌కు గాయాలు

వజ్రకరూరు: మండలంలోని పీసీ ప్యాపిలి గ్రామ సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న ఇంజినీరింగ్ అసిస్టెంట్ హరీష్‌కు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. శనివారం ఉదయం పీసీ.ప్యాపిలి గ్రామ సచివాలయం నుంచి పని నిమిత్తం మండల కేంద్రానికి ద్విచక్రవాహనంలో వస్తుండగా గంజికుంట సమీపంలో ఆయనకు కళ్లు తిరిగడంతో ద్విచక్ర వాహనం నుంచి కిందపడ్డాడు. ఘటనలో అతడి తలకు గాయాలయ్యాయి. వెంటనే అతడిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి

శెట్టూరు: మండల కేంద్రానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు హరినాథ్ రెడ్డి తండ్రి కనకారెడ్డి (80) అనారోగ్యంతో శనివారం ఉదయం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మంత్రి ఉషశ్రీచరణ్ ఫోన్‌లో కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. మంత్రి భర్త శ్రీచరణ్ వెళ్లి భౌతికాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీలు లక్ష్మీదేవి, చంద్రశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు మంజునాథ్, మండల మాజీ కన్వీనర్ సోమనాథ్‌రెడ్డి, సచివాలయాల కన్వీనర్ పెరుగు తిమ్మరాజు, డీసీసీబీ డైరెక్టర్ రామాంజినేయులు, సింగిల్‌విండో అధ్యక్షుడు ఎర్రిస్వామి, వైస్ ఎంపీపీ చెవుల కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

యువకుడికి గాయాలు

కూడేరు: మండలంలోని అరవకూరు వద్ద అనంతపురం-బళ్లారి ప్రధాన రహదారిపై శనివారం జరిగిన ప్రమాదంలో గార్లదిన్నె మండలం లోలూరుకు చెందిన సంజప్ప తీవ్రంగా గాయపడ్డాడు. మర్తాడుకు చెందిన ముత్యాలప్ప, సంజప్ప కూడేరులో పని ముగించుకుని ద్విచక్ర వాహనంలో స్వగ్రామానికి బయలుదేరారు. ఘటనా స్థలికి రాగానే బళ్లారికి వెళ్తున్న కర్ణాటక ఆర్టీసీ బస్సు ఓవర్ టేక్ చేయబోయి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. క్షతగాత్రున్ని 108లో అనంతపురం ఆస్పత్రికి తరలించారు.

రీసర్వేతో భూ సమస్యలకు పరిష్కారం

బ్రహ్మసముద్రం: రీసర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చేకూరుతుందని రెవెన్యూ అధికారులు తెలిపారు. శనివారం మండలంలోని ముప్పలకుంట గ్రామంలో సర్వే నెంబర్ల వారిగా భూ రికార్డులను పరిశీలించారు. వారు మాట్లాడుతూ రీ సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ప్రభుత్వం చేపట్టిన జగనన్న శాశ్వత భూ హక్కు - భూ రక్ష పథకంతో రైతులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. వీఆర్వో మరిస్వామి, రమేష్, సచివాలయ సర్వేయర్ రోజా, రైతులు తదితరులు పాల్గొన్నారు.